కాని వెంకట్రావు "ఏమండీ, చెప్పరేం" మీా కెందుకివ్వాలి? మీారు నన్ను నమ్మలేదు కదా. నేను మిమ్మల్ని ఎందుకు నమ్మాలి?" అన్నాడు. ముసలాయన "అదేమిటీ అలా అంటున్నావు. నిన్ను నమ్మకపోవడమేమిటీ?" అన్నాడు.

వెంటనే వెంకట్రావు, "ఆఁ అదే. ఇంకోసారి మీారు మాట్లాడిన పద్ధతంతా ఇంటికిపోయి తీరుబడిగా కూర్చుని ఓ సారి నెమరువేసుకోండి తెలుస్తుంది" అన్నాడు కటువుగా.

ముసలాయన జన్మలో ఇట్లాంటి పరిస్థితి ఎరుగ్గేలేదు. కాని ఏం చేస్తాడు? ఇక ఇంటికి వెళ్లక తప్పిందికాదు. కాని వెళ్లుతూ వెళ్లుతూ, "ఇదిగో వెంకట్రావ్; నువ్వూ సరిగ్గా మాబాబువే అనిపించుకున్నావ్ వాడూ ఇలాగే మూర్ఖుడులా మాట్లాడేవాడు" అని అనగానే, వెంకట్రావు "ఔనౌను పుల్లయ్యగారూ. అందకపోతే ద్రాక్షపళ్ళు పులుపే. మీా వ్యూహంలో మేం చిక్కకపోతే మరి మూర్ఖులమే" అనేసరికి ముసలాయన గొడుగుచంకను బెట్టుకొని విసురుగా అక్కడనుంచి ఇంటికి వెంచేశాడు.

అదేమిటోగాని ఈ సంఘటన జరిగిన తరువాత వెంకట్రావు ఒక్కరికి అప్పిచ్చిన పాపాన పోలేదు. నిజంగా ఈ పాపమంతా పుల్లయ్యగారిదే అనాలి. ఏమంటారు?

---

కథానిక

# మనస్సాక్షి

జానకీరావ్

టెగార్ట్ లేచి కూర్చున్నాడు. సూర్యోదయమైంది. హైడ్ పార్కులోని చెట్లుమీాది మంచు బిందువులు సూర్యకాంతితో ముత్యాలల్లే మెరుస్తున్నాయి. పక్షులు మధుర ధ్వనులు చేస్తున్నవి. ఈ ప్రకృతి సౌందర్యమంతా చూచి ఆనందించే స్థితిలో లేడు టెగార్ట్. తెల్లారగానే కడుపునిండే అవకాశం వున్న వ్యక్తికి పక్షుల గానం మృదుమధురంగా తోస్తుంది. కాని, టెగార్ట్‌వలె దైన్య స్థితిలో వున్నవాళ్లకి ప్రకృతి శోభ ఆనందం కలిగించదు, పక్షుల పలుకులు ఆహ్లాదాన్నివ్వవు. రాత్రికి తలదాచుకునే చోటు లేక, చలితో బాధపడుతూ టెగార్ట్ మొదటిసారిగా హైడ్‌పార్కులో నిద్రించాడు. టైమెంతైందో చూదామని చేయి చూచుకున్నాడు. కాని ఒక వారం క్రిందటే చేతి గడియారం అమ్మేసిన విషయం అతనికి జ్ఞప్తికొచ్చింది. అన్ని వస్తువులు అమ్మిన తరువాత, చివరికి తిండికోసమని గడియారం అమ్మాడు.

మూడు నెలల క్రింద తన పరిస్థితికి - ప్రస్తుతం తన పరిస్థితికి ఎంత అంతరం వుందో మనస్సుకి తోచగానే, టెగార్ట్ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

మూడు నెలల క్రిందటి ఒక ఉదయం టెగార్ట్ "కంగ్లోమెరేటెడ్ జనరల్"లో పని చేస్తున్నాడు. "లైట్‌హౌస్" పత్రిక సంపాదకుడు టెగార్ట్‌ని చిరునవ్వుతో ఆహ్వానించాడు. "టెగార్ట్! మన పత్రికకి జార్జిగ్రీవ్ ఒక వ్యాసం యిస్తాననాడు. అతనికి వ్రాయడానికి తీరికుండదని నీకు తెలుసుగదా! హాస్యం కొద్దిగా మిళితం చేసి సుమారు పేజీకి సరిపడ వ్రాయి. గ్రీవ్ సంతకం పెడతాడు. ఈ దెబ్బతో మన పత్రికకు మంచిపేరొస్తుంది" అన్నాడు సంపాదకుడు. టెగార్ట్ నవ్వాడు.

"అతను జన్మలో ఒక్క వాక్యమైనా వ్రాసి వుంటాడా?" అన్నాడు టెగార్ట్ నవ్వుతూనే.

"అలాంటి ఆలోచనలు రానివ్వడం తప్పు టెగార్ట్. అతనెలా వ్రాయగలడో నీకు తెలిసే వుంటుంది ఏమైనా కానీ, నువ్వు త్వరగా పూర్తి చేసెయ్యాలి. సంపాదకీయం చూశావా?" అన్నాడు సంపాదకుడు. టెగార్ట్ జేబులోంచి కొన్ని కాగితాలు తీశాడు.

"చూశాను. కొద్దిగా సరిచేస్తే బాగుంటుందని పిస్తోంది. చేయమంటారా?"

"తప్పకుండాను. నాకు అవసరమైన పని వుంది. మళ్ళా శుక్రవారంగాని రాను. గ్రీవ్ వ్యాసం, సంపాదకీయం తయారుచెయ్యి" అంటూ జవాబుకైనా ఎదురుచూడకుండా సంపాదకుడు కోటు తొడుక్కుని పరుగెత్తాడు.

టెగార్ట్ వ్రాయడానికి కూర్చున్నాడు. ఏం

వ్రాయాలి? ఏం వ్రాసినా అది తను వ్రాసినట్లు ఎవరికీ తెలియదు. ఒకళ్లకోసం వ్యాసాలు, సంపాదకీయాలు వ్రాయడం కూడా ఒక కళే. కానీ, యీ కళ మిగిలిన కళలల్లేకాక, కొద్దిగా సంపాదించిపెడుతుంది. టెగార్ట్ సిగిరెట్ వెలిగించి వ్రాయడానికి పూనుకున్నాడు. అరే, కలం సాగదేం? జార్జిగ్రిబ్! పేరు బాగుంది. వాడైతే ఎలా వ్రాసేవాడో! వాడి మొహం, పాడి బుర్ర ఖాళీయే. ఒక్క వాక్యం వ్రాయలేని దద్దమ్మ గ్రిబ్. కాని, ప్రజలు వాడు వ్రాసిన వ్యాసాన్ని చదువుదామనే పత్రిక కొంటారు. వాడి ఆలోచనల్ని ప్రజలు పూజించి పొగుడుతారు. అసలు ఆలోచన లేమిటో? గ్రిబ్ ఆలోచనల్ని టెగార్ట్ ఊహించాలి. ఇది స్ఫురించగానే టెగార్ట్ పెదవులమీద చిరునవ్వు విరిసింది. జార్జి గ్రిబ్ వాడు హాస్యనటశేఖరుడు. బహుశా వాడి మెదడుకి ఆలోచలనేవి తగలవు. కానీ, పాపం ప్రజలు మాత్రం గ్రిబ్‌కి తెలివుందనే నమ్మకంలో వున్నారు. నమ్మకం! ఈ మాట టెగార్ట్‌ని కలవర పరిచింది, పాపం! ప్రజలు గ్రిబ్ వ్రాశాడనుకుని ఆ వ్యాసాన్ని చదువుతారు. డబ్బు ఖర్చు పెడ్తారు. కాబట్టి యిదంతా పచ్చి మోసం.

కాని, గ్రిబ్ సంతకం పెట్టిన మరుక్షణం టెగార్ట్ భావాలన్నీ గ్రిబ్‌వైపోవూ? ఎందుకవవూ? కాబట్టి ప్రజలకేమీ అన్యాయం జరగటంలేదు. కానీ ప్రజలచేత టెగార్ట్ భావాల్ని చదివించటం మోసం కాదూ! ఔను మోసం. ముమ్మాటికీ మోసం. టెగార్ట్ పేరు క్రింద ఆ వ్యాసం వుంటే పత్రిక ఎవరుకొంటారు? ఎవరూ కొనరు. ఈ ఆలోచనలలో టెగార్ట్ మనస్సు వికలం కాసాగింది.

టెగార్ట్ కలం అవతల పారేసి ఇంకొక సిగరెట్ వెలిగించాడు. ఛూత్! బుర్ర చెడిపోయింది. వ్రాయాలి, తప్పదు. వ్రాస్తేగాని గ్రిబ్ సంతకం పెట్టడు, పెడితేగానీ పత్రికలు అమ్ముడుపోవు. ప్రజలు మోసపోరు. మోసం! మళ్ళీ అదేపదం ఆతన్ని కలచివేస్తోంది. ఇదంతా మోసం, పొట్టకోసమని యింత మోసం చెయ్యాలి. కొన్నివేలమంది ప్రజలు మోసపోతేగాని, వెధవ బ్రతుకు నిలవదు. ఎందుకింతఅన్యాయం? ఇదంతాస్వార్థం కాదూ? ఈపని నీచమైనది.

ఏమైనాసరే వ్రాయకూడదు. అది వ్రాయకపోతే ఉద్యోగంపోతుంది. పోనీ! వెధవ ఉద్యోగం—మనస్సాక్షికన్న ఎక్కువా? తనను తానే మోసం చేసుకుని, వేలకొలది ప్రజలను మోసం చేసేపని చేయడానికి టెగార్ట్ మనస్సాక్షి ఒప్పుకొనలేదు. కలం తీయగానే ఏదో తెలియనిబాధ హృదయాన్నావరించసాగింది. పెద్ద నిట్టూర్పు విడిచి, చేతుల్లోతల పెట్టుకూర్చున్నాడు టెగార్ట్.

టెగార్ట్‌పడే మానసికావేదన చూచాయగా గ్రహించాడుప్రక్కనేకూర్చున్న జిమ్మీకొంటర్.

“ఏమిటోయ్, ఉద్రేకంతోఆలోచిస్తున్నావు?” అన్నాడు జిమ్మీ. టెగార్ట్ తల యెత్తాడు.

“రేపువారం పత్రికకి వ్యాసం తయారుచేస్తే గ్రిబ్ సంతకంపెడతాట్ట. అది ప్రజలను మోసం చేయడమనిపిస్తోందినాకు. నువ్వేమంటావు జిమ్?” అన్నాడు టెగార్ట్ జిమ్ కళ్ళల్లోకి చూస్తూ.

“ఔననుకో. ఐతే ఏం?”

“అది—అది చేయడం నాకిష్టం లేదు.” జిమ్మీ నవ్వాడు.

“చూశావా నేనేం రాస్తున్నానో? ఈవారం విడుదలైన అమెరికన్ సినిమామీద సమీక్ష వ్రాస్తున్నాను. నేనింతవరకూ ఆ సినిమా హాలు మొహం చూడలేదు. దీనికేమంటావు?”

“ఔను. అదికూడా అన్యాయమే.”

“అంతా అన్యాయమే బాబూ, మనబ్రతుకే అన్యాయం. కళ్లు మూసుకుని చేదుమందులాగా యీ కల్మషాన్నంతా మింగాలి.” టెగార్ట్ తల పంకించాడు. “హా.” జిమ్మీ ఒక్క క్షణం నిశ్చలంగా చూచాడు.

“ప్రొద్దున్న ఫలహార మేమిటి?” అన్నాడు.

“మ్. నాకీ ఆలోచన యిప్పుడే కలిగింది.”

“పోనీలేగానీ, మళ్ళీ ఎప్పుడూ కలగనియ్యకు. తలొంచుకు వ్రాయవోయి వెధవనీతులు చెప్పక” అని జిమ్మీ తనపని చూచుకోసాగాడు.

టెగార్ట్ కూర్చోలేకపోయాడు. ఆలోచనలు పరంపరలుగా వస్తూ, ఒకదానికొకటి పొసగక అతని బుర్రను వేడెక్కించాయి. గ్రిబ్ యీ క్షణంలో చచ్చిపోగూడదూ? ఏమైనాగానీ ఆ వ్యాసం వ్రాయకూడదు. మనస్సాక్షికి విరుద్ధమైన పని టెగార్ట్‌వల్ల కాదు. జ్వరం వచ్చినంతపనైంది టెగార్ట్‌కి. మనస్సాక్షి! మనస్సాక్షే టెగార్ట్

తండ్రిచేత ఉద్యోగానికి రాజీనామా యిప్పించింది. అదే అంశ మళ్లీ బెగార్ట్‌లో వుండబట్టి అతనాపని చెయ్యలేకపోతున్నాడు. శుక్రవారం నాటికి పేజీలు నల్లపడలేదు.

సంపాదకుడు బెగార్ట్‌ని పిలిచాడు. "ఇల్లా చూడు, సంపాదకీయం ఏదో సారమల్లే వుంది కానీ,సరైన"స్టయిల్"రాలేదేం?"అన్నాడాయన.

బెగార్ట్ మాటలు దొరక్క తికమకపడ్డాడు.

"నే ననుకున్నాను...అది మీరే సరి చేసుకొంటే..."

సంపాదకుడు ఒక్కక్షణం బెగార్ట్ వంక పరీక్షగా చూచాడు.

"నాకు బహుశా తీరికుండదు. నువ్వే పూర్తి చేసెయ్యి."

"నేను చెయ్యలేననుకుంటాను. అదే... నేను, అంటే... నేను..."

సంపాదకుడు మృదువుగా అడిగాడు "వంట్లో బాగుండలేదా?"

"అబ్బే. బాగానే వున్నానే?" అన్నాడు బెగార్ట్.

"ఏదన్నా ఆపదలో వున్నావా?"

"ఏమీలేదు. కానీ..."

"పోనీలే. దీన్ని పూర్తి చేసెయ్యి. గ్రీబ్ వ్యాసం ఎల్లావుంది?"

"అది వ్రాయలేదు" సంపాదకుడు ముఖం చిట్లించాడు.

"ఏమిటి నువ్వంటున్నది?"

"నేను దాన్ని వ్రాయలేకపోయాను"అన్నాడు బెగార్ట్ తలవంచి.

"అరే. ఎందుకు చేతకాలేదు? పత్రికకి పేరు కావాలనే కోరికవుంటే తప్పక కుదురుతుంది."

బెగార్ట్ గుటకలు మ్రింగాడు.

"అది ప్రజలను మోసం చెయ్యడం కదూ?" సంపాదకుడు కళ్లు పెద్దవి చేశాడు.

"నీ మాటలు అర్థంకావటం లేదు."

"మరొకరి సమని ఇకముందు నేను వ్యాసాలు వ్రాయదల్చుకోలేదు." సంపాదకుని ముఖం ఎర్రపడింది.

"మేము చెప్పినది చెయ్యడానికి నీకు జీతం ఇస్తున్నాము. అది చేయడం ఏ అభిమానానికి విరుద్ధమైనప్పుడు నిన్ను తొలగించే అధికారం మాకుంది. కాని, నీకేమైందో నాకర్థంకావటం లేదు," బెగార్ట్ ముఖంమీద శుష్క మందహాసం కనుపించింది.

"మనస్సుని మోసం చేసుకునే శక్తిలేక బాధపడుతున్నాను. కాని, యిది వ్యాపార రీత్యా కూడా అన్యాయంకాదూ?"

సంపాదకుని వదనం విషణ్ణమైంది.

"నేనెన్నడూ యింత అవమానం పొందలేదు. గుడ్‌బై. నువ్వింక స్వేచ్ఛననుభవించవచ్చు."

బెగార్ష్ కాకితాలు బల్లమీద పడేసి, త్వరితంగా నడిచి వెళ్ళి, తలుపుదగ్గర ఆగాడు.

"సారీ, నావల్ల నేమీకాదు."అంటూ నిష్క్రమించాడు.

మూడు నెలలకాలం అతడు స్వాతంత్ర్యం అనుభవించాడు. బెగార్ట్ పేరు ఎవరికీ తెలియదు. "కంగ్లోమెరేటెడ్ జనరల్స్"నుంచి తాను విరమించిన పరిస్థితులు సరిగ్గా చెప్పలేకపోయాడతను. ఏ విధంగానూ ఖ్యాతిలేని బెగార్ట్‌కి పని దొరకలేదు. మాట పట్టింపులమీద మానేశానని బెగార్ట్ తాను వెళ్ళిన చోటల్లా చెప్తున్నాడు. కాని చాలామంది జర్నలిస్టుల అభిప్రాయం ఆతడు జార్జిగ్రీబ్‌ని తిట్టి, ఆ వ్యాసం వ్రాయనన్నాడు అని. "లైట్‌హౌస్" పత్రిక కొని చదివాడు బెగార్ట్. గ్రీబ్ వ్యాసం ఎవరో వ్రాశాడు. ఆ వ్యాసం అతను వ్రాస్తే అంతకంటే లక్షరెట్లు బాగుండేది. ఆ వ్యాసంలో తనకు తోచిన లోపాలన్నీ పెన్సిలుతో గుర్తుపెట్టాడతను. ఆ మూడు నెలల కాలంలో తిండికిలేక బట్టలతో సహా అమ్మాడు బెగార్ట్. కాని, యీ బాధలోనైనా అతనికి తను చేసినపని పొరబాటేమోనన్న ఆలోచన కలుగలేదు.

హైడ్‌పార్కులోని సిమ్మెంటు బెంచిమీద కూర్చున్న బెగార్ట్ జరిగినదంతా ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. అదంతా ఒక స్వప్నంలా తోచిందాతనికి మానవులు వింత ప్రాణులు. ఇలాంటి ఆలోచనలే వాళ్లకి వున్నట్టుండి వస్తూంటాయి. ఏ పని చెయ్యాలన్నా మానవులకి ఆత్మ అనేది ఘోషిస్తూంటుంది. మనస్సాక్షి ఒప్పుకోదు. బెగార్ట్ నేటి స్థితికి కారణం అతని మనస్సాక్షే. భేష్! మనస్సాక్షి! అదొక పెనుభూతం.

('గాల్స్‌వర్దీ' రచన ఆధారంగా)